క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


గురుబ్రహ్మ, డీటీ


నగేష్ బాబు, ఆర్ఐ

బెళుగుప్ప: బదిలీపై వచ్చిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గురుబ్రహ్మ, ఆర్ఐ నగేష్ బాబు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బెళుగుప్ప మండల రీసర్వే డీటీగా ఇది వరకు విధులు నిర్వర్తిస్తున్న సురేఖ పామిడి మండలానికి బదిలీ అయ్యారు. కుందుర్పి డీటీగా ఉన్న గురుబ్రహ్మ బెళుగుప్పకు బదిలీపై వచ్చారు. ఇది వరకు బెళుగుప్ప ఆర్ఐగా ఉన్న రమాదేవి అనంతపురం బదిలీ అయ్యారు. కూడేరు ఆర్ఐగా ఉన్న నగేష్‌బాబు బదిలీపై బెళుగుప్పకు వచ్చారు. ఈ సందర్భంగా డీటీ, ఆర్ఐలు మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


ఉంతకల్లులో వృషభాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

బొమ్మనహాళ్: ఏరువాక పౌర్ణమి వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలోని ఉంతకల్లు, లింగదహాళ్, శ్రీధరఘట్ట, కృష్ణాపురం తదితర గ్రామాల్లో వృషభాలను ఊరేగించారు. రైతులు తమ వృషభాలను రంగులతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయాలకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. డప్పు చప్పుళ్లతో ఊరు వాకిలి నుంచి ఊరేగింపు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుళ్లకు మొక్కుకున్నారు. ఊరేగింపులో గెలుపొందిన వృషభాల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు.

అనాథ పిల్లల చదువుకు బాసట

ఉరవకొండ రూరల్: ఉరవకొండ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చదివిస్తామని ఆర్ఫాన్స్ చిల్డ్రన్స్ ఆశ్రమ నిర్వాహకుడు పాస్టర్ సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతలు కరువైన పిల్లలకు ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి 10 తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని పేర్కొన్నారు. పిల్లల సంరక్షకులు ఉరవకొండ పట్టణంలోని ఆశ్రమంలో సంప్రదించాలని సూచించార

మలేరియా నివారణపై అవగాహన


మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాయదుర్గంటౌన్: మలేరియా ప్రమాదకరమే.. కానీ జాగ్రత్తలతో నియంత్రణ సాధ్యమేనని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని 7, 9, 10 సచివాలయాల పరిధిలో మలేరియా వ్యతిరేక మహోత్సవాల్లో భాగంగా ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సరైన అవగాహన, నివారణచర్యలతో పూర్తి నియంత్రించవచ్చని, ఇందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, సూర్యనారాయణ, హెల్త్ సెక్రటరీలు సరోజమ్మ, ప్రమీల, విజయలక్ష్మీ, సుజాత, ఆశా కార్యకర్తలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు: మండల కేంద్రమైన కణేకల్లులోని నేసేపేట కాలనీలో రూ.72 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దుస్థితిలో ఉన్న కాలనీ రోడ్లను తమ ప్రభుత్వం బాగు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయసింహారెడ్డి, సర్పంచు నిర్మల, మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు చేసేదెన్నడో?


గోవిందవాడ క్రాస్ వద్ద మరమ్మతుకు నోచుకోని చేతిపంపు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ క్రాస్ వద్ద ఉన్న చేతి పంపు చెడిపోయి నెలలు గడుస్తోంది. గోవిందవాడ క్రాస్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గతిలో ఈ చేతి పంపు నుంచి వచ్చే నీటిని తాగేవారు. చేతి పంపు నిరుపయోగంగా మారడంతో కొందరు ఏకంగా ఆ పంపునకు ఆనుకొనే రేకుల దుకాణం ఏర్పాటు చేసుకోవడంతో అధికారులు చేతిపంపును పట్టించుకోలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరిస్తున్న మేఘం..



వరుణ దేవుడు కరుణించడం లేదు.. రోజూ మేఘాలు దట్టంగా కమ్ముకుని రైతులను ఊరిస్తున్నాయే తప్ప నేల చినుకు రాలడం లేదు. వర్షం కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ విత్తు అదును సమయం ఈనెల 15 నుంచి మొదలవుతుంది. కూడేరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 35 వేల ఎకరాల్లో వేరుశనగ, సుమారు 10 వేల ఎకరాల్లో కంది, సుమారు 5 వేల ఎకరాల్లో ఆముదం, దాదాపు 5 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తారు. మార్కెట్, ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే విత్తన వేరుశనగ కాయలను తీసుకుని విత్తనాలు సిద్ధం చేసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

– కూడేరు:

నడిరోడ్డుపై వ్యాపారం


గాంధీసర్కిల్‌లో రోడ్డుపై బండ్లు ఉంచి వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని గాంధీ సర్కిల్ (పాత టవర్ క్లాక్)లో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. నడిరోడ్డుపై తోపుడు బండ్లను ఉంచి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలల క్రితం ఈ ప్రాంతంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకున్నారు. మరో వైపు వినాయక సర్కిల్‌కు వెళ్లే మార్గంలో రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

జోరు వానలోనూ సడలని సంకల్పం


రుద్రంపల్లిలో తలారి రంగయ్యను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం


తిమ్మాపురంలో జరిగిన పాదయాత్రకు హాజరైన జనసందోహం


సేవ్ ఆర్డీటీ ప్లకార్డులతో పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న మహిళలు

- ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ కోసం కదం తొక్కుతున్న ప్రజలు
- జిల్లా నలుమూలల నుంచి పాదయాత్రకు మద్దతు

కళ్యాణదుర్గం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ కోసం జోరు వానలోనూ ప్రజల సంకల్పం సడలేదు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డి నుండి బుధవారం ప్రారంభమైన పాదయాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎనుములదొడ్డి నుంచి గురివేపల్లి, రుద్రంపల్లి, తిమ్మాపురం, అండేపల్లి గేట్ వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రుద్రంపల్లిలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్ గౌడ్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అదే సమయంలో జోరువాన కురిసింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పాదయాత్ర కొనసాగడంతో ప్రజలు మరింత ఉత్సాహంగా మద్దతు పలికారు. అనంతరం రుద్రంపల్లిలో మాజీ మంత్రి, శింగనమల సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలు పాదయాత్రకు మద్దతు పలికారు. 100 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసిన సందర్భంగా ఓబిగానిపల్లి చెక్‌పోస్టు వద్ద 100 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా అతిథులు మొక్కలు నాటారు. అనంతరం అక్కడి నుంచి తిమ్మాపురంకు పాదయాత్ర కొనసాగింది. తిమ్మాపురంలోకి ప్రారంభించగానే ప్రజలు పూలలు చల్లుతూ డప్పులు వాయిస్తూ ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఆర్డీటీ ఫాదర్ విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్, వాల్మీకి మహర్షి, మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాలలో జరిగిన పాదయాత్రకు స్థానికులు మద్దతు పలికారు. తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు జిల్లా నలుమూలల నుంచి పాదయాత్రకు మద్దతు పలికారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ భీమేష్, మున్సిపల్ విభాగం కన్వీనర్ ఐ. సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, జీహెచ్ రాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీలు అంజి, కమలా నాగరాజు, వైస్ ఎంపీపీ ముత్యాలు, పార్టీ ఉపాధ్యక్షులు మఠం భీమప్ప, బొమ్మలింగ, కిరీటి యాదవ్, జేఏసీ కన్వీనర్ ఈ రాము, ఎస్సీసెల్ తాలూకా అధ్యక్షుడు తిప్పేస్వామి, సర్పంచులు సంధ్యాహరినాథ్, గంగాధర్, బాపూజీ, అమర్, శివ, రాజగోపాల్, చెన్నయ్య, చంద్ర, వైస్ ఎంపీపీలు తిమ్మారెడ్డి, సోమశేఖర్, ఎంపీటీసీలు భాస్కర్, బసప్ప, కో ఆప్షన్ ఫయాజ్, మల్లేశు, నాగరాజు, అనుబంధ సంఘాల నాయకులు డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు నీలిశంకరప్ప, మాజీ మండల కన్వీనర్ బాలరాజు, రామాంజినేయులు, రమేష్, నియోజకవర్గాల విభాగాల అధ్యక్షులు కిరణ్, దాదు, ఆదెప్ప, పాతలింగ, నాయకులు తలారి రమేష్, యువజన విభాగం రవి, నూతిమడుగు రామ్మోహన్, రాము, మల్లూరి వెంకటేశులు, రఘు, మండల ఉపాధ్యక్షుడు లోక్‌నాథ్, వెంకటేశులు, ప్రధాన కార్యదర్శులు మాధవయ్య, బయ్యన్న, తిమ్మరాయుడు, ఈరన్న, కురవ గంగాధర, ధన్‌రాజ్, ఫైవ్ స్టార్ చిన్నా, కేశవులు, హరి, గంగన్న, కేశవ, మార్కు, మైనార్టీ సెల్ బాబు, గంగాధర, వెంకటప్ప, మల్లారెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి, నరేష్, చిరంజీవి, నాగరాజు, వైస్ సర్పంచు నాగేంద్ర, మారుతి, అచ్చంపల్లి నాగరాజు, ఎంటీ బాబు, గోపి, విల్సన్, రాజు, గూళ్యం రాజు, రఘునాథ్‌రెడ్డి, యర్రంపల్లి కృష్ణమూర్తి, గోపాల్, దొడగట్ట మురళిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మాజీ మంత్రి శైలజనాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య

విత్తన వేరుశనగ పంపిణీ


వేరుశనగ విత్తనం పంపిణీ చేస్తున్న అధికారులు

కుందుర్పి: అప్పిలేపల్లిలో బుధవారం 102 మంది రైతులకు 336 బస్తాల వేరుశనగ విత్తనం పంపిణీ చేసినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, సర్పంచ్ అతావుల్లా తెలిపారు. కార్యక్రమంలో వడ్డె రామాంజినేయులు, అనుసూయమ్మ, జయమ్మ, ప్యారీజా తదితరులు పాల్గొన్నారు. మండలానికి 2800 వందల క్వింటాళ్ల విత్తనం కేటాయించగా ప్రస్తుతం 660 క్వింటాళ్ల విత్తనం సరఫరా అయినట్లు ఏఓ మహేష్ తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కోట్ల మహేష్‌రెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో కోట్ల మహేష్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. బేలోడుకు చెందిన కోట్ల మహేష్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే ప్రధాన రోడ్డుపైకి రాగానే అటు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నేత్రపల్లి నుంచి కలుగోడు వరకూ వెళ్లే ప్రధాన రహదారికి రోడ్డుకిరువైపుల బేలోడు చెరువు మట్టిని టిప్పర్ల ద్వారా కాంట్రాక్టర్ అనధికారికంగా తరలిస్తున్నాడు. గ్రామంలో నెమ్మదిగా వెళ్లాలని గ్రామస్తులు హెచ్చరిస్తున్నప్పటికీ టిప్పర్ల డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మహేష్ రెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పోలీసులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.

విద్యుత్ స్తంభం తొలగింపు


తొలగించక ముందు ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం


సాక్షి కథనం అనంతరం విద్యుత్ స్తంభాన్ని తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్ కో అధికారులు స్పందించారు. వైఎస్సార్ విగ్రహం ముందు వైపు దుకాణాలు, ప్రధాన రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. విద్యుత్ తీగలను పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి అమర్చి విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ ప్రమాదం ముప్పు తప్పడంతో ప్రజలు, ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు.

దోమకాటు నివారణకు చర్యలు


బాయ్స్ హాస్టల్‌లో మలాథియన్ మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

కూడేరు: విద్యార్థులు దోమకాటుకు గురై రోగాల బారిన పడకుండా వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కానుండటంతో పారిశుధ్య పనులు చేయించారు. బుధవారం బాలుర, బాలికల వసతి గృహాలు, కేజీబీవీల్లో వైద్యాధికారులు దోమలను నివారించేందుకు మలాథియన్ మందును గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాల్లో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్లు శ్రీధర్‌మూర్తి, రవీంద్ర, హెల్త్ అసిస్టెంట్లు శివ ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7,130 నగదును, 52 పేక ముక్కలను, 2 ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకున్న మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను రాయదుర్గం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాడు - నేడు పనులకు గ్రహణం

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిన పనులు
- ఏడాది కావస్తున్నా ఊసేలేని మనబడి- మన భవిష్యత్ పథకం
- నేటి నుంచి ప్రారంభంకానున్న పాఠశాలలు
- అసంపూర్తి భవనాల్లోకి వెళ్లేందుకు విద్యార్థుల ఆందోళన


ఉంతకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గదిలోనే విద్యార్థుల చదువు (ఫైల్)


దోర్స్ లేకుండా ఉన్న గదులు

బొమ్మనహాళ్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే నాడు - నేడు పనులకు గ్రహణం పట్టింది. నాడు-నేడు పథకం పేరును మనబడి-మన భవిష్యత్‌గా మార్చినా భవనాల నిర్మాణ పనులను ప్రారంభించకపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పాఠశాలల నిర్మాణాలకు నిధులు నిలిపి వేయడంతో పాటు జరుగుతున్న పనులను సైతం ఎక్కడికక్కడ నిలిపి వేయడంతో పాఠశాలల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పాఠశాలల్లో నిర్మాణ దశలో ఉన్న తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోగా విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో మహర్దశ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బొమ్మనహాళ్ మండలంలో నాడు-నేడు మొదటి విడత కింద 25 పాఠశాలలను రూ. 5,59,72,371తో మరమ్మతు చేసి అభివృద్ధి చేశారు. రెండో విడత కింద 40 పాఠశాలలకు రూ. 3,43,39,000 మంజూరు కాగా పనులు రూ. 1,46,30,000 ఖర్చు పెట్టారు. అదనపు తగరతి గదుల నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో తరువాత నిధులు రాకపోవడంతో మిగతా పనులు ముఖ్యంగా ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ కొన్ని చోట్ల, నిర్మాణ పనులు, కొన్ని చోట్ల విద్యుత్ ఇతర పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

అవస్థలు పడుతున్న విద్యార్థులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ. 1,98,88,511 నిధులు మంజూరు చేసింది. దాదాపు 60 శాతం పనులు పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. కిటికీలు లేకపోవడంతో విద్యార్థులు ఎండ తగలకుండా ఉండేందుకు యూరియా సంచులు అడ్డుపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పనులు వెంటనే పూర్తి చేయాలి



నాడు-నేడు మొదటి, రెండో విడత కింద పాఠశాల రూపురేఖలు మార్చేందుకు గత ప్రభుత్వం ఎన్నో కోట్లు ఖర్చు చేసింది. కొన్ని పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగిపోయిన నాడు-నేడు పనులను పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయలేదు. అసౌకర్యాల మధ్యనే విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. వెంటనే ప్రారంభించి పనులను పూర్తి చేయాలి.

– వనజాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు, ఉంతకల్లు

పనులు నిలిపేయడం సరికాదు



కూటమి ప్రభుత్వం మనబడి-మన భవిష్యత్ పథకం ద్వారా తక్షణం నిధులు విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలి. ఎలక్ట్రికల్, పెయింటింగ్, ఫ్లోరింగ్, డోర్స్, కిటికీలు, తాగునీటి తదితర పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. గత ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించి నూతన తరగతి భవనాలను నిర్మించింది. ఇలాంటి అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడం మంచిదికాదు.

– ముక్కన్న, సర్పంచ్, ఉంతకల్లు

నిధులు రాగానే పనులు



మనబడి-మన భవిష్యత్ పథకం కింద నిధులు వస్తాయి. వచ్చిన వెంటనే అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను గుర్తించి ప్రారంభిస్తాం. రెండో విడత కింద 40 పాఠశాలల్లో ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చాలా పాఠశాలల్లో ఎలక్ట్రికల్, పెయింటింగ్, ఫ్లోరింగ్, డోర్స్, కిటికీలు, తాగునీటి తదితర పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమైన తరువాత పాఠశాలల అవసరాల బట్టి మనబడి-మన భవిష్యత్ పథకం కింద నిర్మాణానికి అవసరమైన నిధులు వస్తాయి. నిధులు వచ్చిన వెంటనే పనులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

– మల్లికార్జున, ఎంఈఓ, బొమ్మనహాళ్

విద్యుదాఘాతంతో వివాహిత మృతి


మృతురాలు రాధిక

గుమ్మఘట్ట: మండలంలోని దేవరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవికుమార్ భార్య రాధిక(33) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. రవికుమార్ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగించేవారు. నెల రోజుల క్రితం పనుల కోసమని బెంగళూరుకు రవికుమార్ వెళ్లాడు. ఇద్దరు పిల్లలతో రాధిక ఇంట్లోనే ఉండేది. మంగళవారం రాత్రి ఇంట్లో నీటితో ఇంటిని శుభ్రం చేస్తుండగా ఫ్రిజ్‌కున్న కేబుల్ డ్యామేజ్‌ను గమనించకుండా తాకడంతో షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను రాయదుర్గంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుమ్మఘట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.